

సీడీసీ చైర్మన్‌గా ఇర్షాద్ నియామకం

సదాశివనగర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్‌గా మహమ్మద్ ఇర్షాద్ నియామకం అయ్యారు. ఈ మేరకు పరిశ్రమల అభివృద్ధి శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తన కోసం కష్టపడ్డ వారికి సముచిత స్థానం కల్పించడంలో మదన్‌మోహన్ ఆదర్శంగా నిలుస్తున్నారని ఆయన తెలిపారు. సీడీసీ చైర్మన్‌గా తనను నియమించినందుకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సామాన్యుల ప్లాట్లలో.. దౌర్జన్యంగా రోడ్డు!



కామారెడ్డిలో వంద ఫీట్ల రోడ్డు వేసిన దృశ్యం

- రాత్రికి రాత్రే వెలిసిన వంద ఫీట్ల రహదారి
- బడాబాబుల వెంచర్ల కోసం సామాన్యుల ప్లాట్లు బలి
- ఓ విద్యాసంస్థల నిర్వాహకుడు మట్టిరోడ్డు వేసినట్లు ఆరోపణలు
- బడాబాబులకు అండగా పలువురు ప్రజాప్రతినిధులు
- సమాచారం ఇవ్వకుండా ప్లాట్లలో రోడ్డు ఎలా వేస్తారని నిలదీత
- సుమారు 35 మంది సామాన్యులు స్థలం కోల్పోనున్నారు
- ఇదే వంద ఫీట్ల రోడ్డుపై గతంలో కొందరు రైతుల నుంచి వ్యతిరేకత
- లింగాపూర్ గేటు వద్ద కొందరు ఎస్సీ భూములను లాక్కునే ప్రయత్నం

కామారెడ్డి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రూపాయి.. రూపాయి కూడ బెట్టుకుని సొంత ప్లాట్లు కొని ఇళ్లు కట్టుకుందామనుకున్న సామాన్యుల ప్లాట్లలోంచి దౌర్జన్యంగా రాత్రికి రాత్రే వందఫీట్ల రోడ్డు వేశారు. రెండ్రోజుల కిందట వచ్చి చూస్తే ప్లాట్లుగా ఉన్న ఆ ప్రాంతంలో వంద ఫీట్ల రోడ్డు వేసే వరకు సదరు ప్లాట్ల యజమానులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సంప్రదింపులు జరపకుండా లక్షల రూపాయల విలువ చేసే ప్లాట్లలోంచి రోడ్డు ఎలా వేస్తారని యజమానులు ఆందోళనకు గురవుతున్నారు. కామారెడ్డి పట్టణ శివారుల్లో పాత కలెక్టరేట్ వెనుక భాగంలో కొందరు పేద, మధ్య తరగతి సామాన్యులు గతంలో ప్లాట్లను కొనుగోలు చేశారు. అయితే ఇటీవల ప్రభుత్వం నుంచి కాని, మున్సిపాలిటీ నుంచి కానీ ఎలాంటి ప్రతిపాదనలు లేకున్నప్పటికీ దౌర్జన్యంగా తమ ప్లాట్లలోంచి రోడ్డు వేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పంచాయతీ లేఅవుట్ అనుమతి ఇచ్చిన వెంచర్‌లో తమ ప్లాట్ల వద్ద రోడ్డు లేకున్నా ఇప్పుడు వందఫీట్ల రోడ్డు ఎలా వెలుస్తుందని బాధితులు ప్రశ్నిస్తున్నారు. తమ ప్లాట్ల సమీపంలో ఉన్న కొందరు బడాబాబుల భూముల కోసమే రాజకీయ నేతల అండతో ఈ రోడ్డు వేశారని బాధితులు ఆరోపిస్తున్నారు.

నాలుగున్నర ఎకరాల్లో గ్రామ పంచాయతీ లేఅవుట్

కామారెడ్డి పట్టణ శివారులోని దేవునిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో 1984లో అప్పటి ఎన్‌హెచ్- 7 జాతీయ రహదారి పక్కన ఉన్న సబ్‌స్టేషన్ వెనుక నాలుగున్నర ఎకరాల ప్రైవేట్ భూముల్లో గ్రామ పంచాయతీ నిబంధనల ప్రకారం కొందరు లేఅవుట్ చేశారు. అయితే ఈ లేఅవుట్ వెంచర్‌లో కామారెడ్డి పట్టణంతో పాటు శివారు గ్రామాల్లోని కొందరు పేద, మధ్య తరగతి సామాన్య ప్రజలు 93 ప్లాట్లను కొనుగోలు చేశారు. అయితే ఆ సమయంలో ఈ వెంచర్‌లో పంచాయతీ నిబంధనల ప్రకారం రోడ్లు వేసినవి ఉన్నాయి. అప్పుడు ఈ ప్లాట్ల గుండా వందఫీట్ల రోడ్డు ప్రతిపాదన లేదు. అయితే గత రెండేళ్ల కిందట అప్పటి ప్రజాప్రతినిధులు పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని నిజాం సాగర్ రోడ్డులోని లింగాపూర్ గేటు నుంచి జాతీయరహదారి సబ్‌స్టేషన్ వరకు వందఫీట్ల రోడ్డు వేయాలని ప్రతిపాదించారు. అయితే ప్రధానంగా ఈ ప్రాంతంలో హైటెన్షన్ వైర్ల కింద ఈ రోడ్డు తీయాలని నిర్ణయించారు. ఇందుకు అప్పటి ప్రభుత్వం కొన్ని నిధులు సైతం మంజూరు చేసింది. అయితే కొందరు రైతులు ప్రైవేట్ వెంచర్ల ప్లాట్ల నిర్వాహకులు వ్యతిరేకించడంతో ఆ ప్రాతిపాదన మూలనపడింది. అయితే ప్రస్తుతం కొందరు బడాబాబులు తమ భూముల కోసం గతంలో కొన్న ప్లాట్ల నుంచి వందఫీట్ల రోడ్డు రాత్రికి రాత్రే వేయడంతో ఆ ప్లాట్ల యజమానులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. సుమారు ఎకరన్నర విస్తీర్ణంలో 35 మంది సామాన్యుల ప్లాట్లు వందఫీట్ల రోడ్డులో పోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు పనులను అడ్డుకున్న బాధితులు

పాత ఎన్‌హెచ్-7 రోడ్డు పక్కన ఉన్న సబ్‌స్టేషన్ వెనుకభాగంలో గతంలో చేసిన లే అవుట్ వెంచర్‌లో సామాన్యుల ప్లాట్లలోంచి రాత్రికి రాత్రే వందఫీట్ల రోడ్డు వేయడం ఆ పనులు మంగళవారం సైతం కొనసాగుతుండడంతో విషయం తెలుసుకున్న ప్లాట్ల యజమానులు అక్కడికి చేరుకున్నారు. బాధితుల ప్లాట్లలోంచే మొరం కుప్పలతో రోడ్డు వేసి రోడ్డురోలర్‌తో పని చేస్తుండగా అడ్డుకున్నారు. తమకు సమాచారం ఇవ్వకుండా నష్టపరిహారం తేల్చకుండా రోడ్డు ఎలా వేస్తారని ప్రశ్నించారు. ఈ ప్లాట్లలోంచి వందఫీట్ల రోడ్డు ప్రతిపాదన గతంలో లేకపోవడంతోనే తాము లక్షలు వెచ్చించి కొనుగోలు చేశామన్నారు. నష్ట పరిహారం లేకుండా తమ రోడ్ల నుంచి రోడ్డు వేయడం సరికాదన్నారు. మున్సిపాలిటీ నుంచి కాకుండా ప్రైవేట్ వ్యక్తులు దౌర్జన్యంగా మా ప్లాట్లలోంచి ఎలా రోడ్లు వేస్తారని నిలదీశారు. రెండు రోజుల క్రితం తమ ప్లాట్ల వద్దకు వచ్చి చూస్తే ప్లాట్లుగా ఉన్నాయని మంగళవారం వచ్చే సరికి ప్లాట్లలో రోడ్డు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఓ ప్రైవేట్ విద్యా సంస్థల నిర్వాహకుడి భూముల కోసమేనా?

దేవునిపల్లి, లింగాపూర్ గేటు ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేట్ విద్యా సంస్థలకు చెందిన నిర్వాహకుడి భూముల కోసమే దౌర్జన్యంగా సామాన్యుల ప్లాట్లను కొల్లగొట్టి వందఫీట్ల రోడ్డు పనులు చేయించాడని బాధితులు ఆరోపిస్తున్నారు. లింగాపూర్ గేటు నుంచి సబ్‌స్టేషన్ వరకు ప్రతిపాదించిన వందఫీట్ల రోడ్డు సమీపంలో సదరు నిర్వహకుడికి సుమారు 50 ఎకరాలకు పైగా భూములు ఉన్నాయి. ఇతనితో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు వంద ఎకరాలకు పైగా భూమి ఉంది. వీరి భూముల విలువ పెంచేందుకే వందఫీట్ల రోడ్డు వేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి డెవలప్‌మెంట్ చేస్తున్నాడని వారి వెంచర్ల కోసమే ఈ రహదారిని ఏర్పాటు చేస్తున్నారంటూ విమర్శలు వస్తున్నాయి. గత 20 రోజుల కిందట ఈ వంద ఫీట్ల రోడ్డుకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సర్వే చేసేందుకు వెళ్లగా కొందరు చిన్న, సన్నకారు రైతులు అడ్డుకున్నారు. దీంతో సర్వేను నిలిపివేసి అధికారులు వెనుదిరిగారు. ఆ రైతులు సైతం వారికి ఉన్న అర ఎకరం భూముల్లో హద్దులు పాతుకొని రోడ్డుకు భూమి ఇవ్వమని తేల్చి చెప్పారు. దీంతో అక్కడ రోడ్డు పనులు నిలిచిపోవడంతో సబ్‌స్టేషన్ వెనుక నుంచి సామాన్యుల ప్లాట్లలోంచి ఏకంగా సదరు విద్యాసంస్థల నిర్వాహకుడు వందఫీట్ల రోడ్డు వేయడంపై కామారెడ్డిలో చర్చనీయాంశంగా మారింది. హైటెన్షన్ వైర్ల కారణం చూపుతూ వాటికిందే వందఫీట్ల రోడ్డు వేస్తున్నామని బడాబాబులు చెబుతున్నప్పటికీ నష్టపోయేది మాత్రం సామాన్య ప్లాట్ల యజమానులు, చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు.

ఓ ప్రజాప్రతినిధి అండ

ఈ వందఫీట్ల రోడ్డు ఏర్పాటుపై ఓ ప్రజాప్రతినిధి, బడాబాబుల మధ్య ఒప్పందం కుదిరినట్లు బాధిత రైతులతో పాటు ప్లాట్ల యజమానుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి వందఫీట్ల రోడ్డు ఏర్పాటుకు ఆ ప్రాంతంలోని కొందరు రైతులతో సదరు ప్రజాప్రతినిధి గతంలోనే సమావేశమై ఓ ఒప్పందానికి వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. అయితే పెద్ద మొత్తంలో భూములు ఉన్న యజమానులు స్వచ్ఛందంగా భూమి ఇస్తామని సదరు ప్రజాప్రతినిధితో చెప్పడం బట్టిచూస్తే రియల్ వ్యాపారులు ఆ యజమానులతో సంప్రదింపులు జరిపారే తప్ప రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న చిన్న, సన్నకారు రైతులు, ప్లాట్లు ఉన్న సామాన్యులకు మాత్రం ఎలాంటి ఒప్పందం కుదుర్చుకోలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో గజానికి రూ.12 వేల నుంచి రూ.15వేల వరకు ధర పలుకుతోంది. అయితే సదరు ప్రజాప్రతినిధి ప్లాట్ల యజమానులను పిలిపించుకుని గజానికి రూ.2వేల చొప్పున నష్టపరిహారం ఇప్పిస్తానని చెప్పినట్లు తెలుస్తోంది. అయితే ప్లాట్ల యజమానులు మాత్రం మార్కెట్‌లో ఉన్న దానికంటే 50 శాతమైన అనగా రూ.8వేల నుంచి రూ.10వేల వరకు నష్టపరిహారం ఇప్పించాలని కోరినట్లు తెలిసింది. అయితే నేను చెప్పిన రేటుకు ఇవ్వకుంటే బాగుండదని రోడ్డు మాత్రం ఖచ్చితంగా వేస్తామని సదరు ప్రజాప్రతినిధి చెప్పినట్లు తెలిసింది. అయితే మంగళవారం బాధితులు రోడ్డు పనులను ఆపుతుండగా ఈ ప్రజాప్రతినిధికి చెందిన ఓ అనుచరుడు అక్కడికి వచ్చి బాధితులను బెదిరించినట్లు తెలుస్తోంది. ఇందులో నా ప్లాట్ కూడా ఉంది నేనే ఇస్తున్నా మీరు ఇవ్వకుంటే బాగుండదని అడ్డుకుంటే కేసులు పెట్టడానికైనా వెనుకాడనని హెచ్చరించినట్లు బాధితులు చెబుతున్నారు. తమకు నష్టపరిహారం తేల్చాక సర్వే చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.



నిరసన తెలుపుతున్న బాధితులు

నయా జోష్







కామారెడ్డిలోని ఓ బేకరీలో ప్రజల సందడి

- జిల్లా వ్యాప్తంగా కొత్త సంవత్సర సంబరాలు
- అర్ధరాత్రి కేక్ కటింగ్‌లు, యువతీ, యువకుల కేరింతలు
- 2025కు స్వాగతం పలికిన జిల్లా వాసులు

కామారెడ్డి టౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కాలచక్రం గిర్రున తిరిగింది. చూస్తుండగానే ఏడాది గడిచిపోయింది. ఎన్నో చేదూ జ్ఞాపకాలు మిగిల్చి.. తీపి అనుబూతులను పంచి.. మరెన్నో లక్ష్యాలను సాధించి పెట్టి.. కాల గర్భంలోకి 2024 సంవత్సరం చల్లగా జారుకుంది. ఎన్నో ఆశలను మదిలో ఉంచుకుని.. అనేక లక్ష్యాలను సాధించడంతో పాటు జీవితం సాఫీగా సాగాలని కామారెడ్డి జిల్లా ప్రజానికం అర్ధరాత్రి 12 గంటల తర్వాత 2025 సంవత్సరానికి ఘనస్వాగతం పలికారు. గతంతో పోలిస్తే ఈ సారి న్యూయర్ వేడుకలు రెట్టింపు అయ్యాయి. చాలా వరకు కుటుంబ సభ్యుల మధ్యలోనే కేకులు కట్ చేశారు. యువతి, యువకులు స్నేహితులతో కలిసి సంబరాల్లో పాలుపంచుకున్నారు.

సాయంత్రం నుంచే సంబరాలకు సిద్ధమైన ప్రజలు

జిల్లాలో పలు మండలాల్లో కొత్త సంవత్సరం వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. సాయంత్రం నుంచే సంబరాలు మొదలయ్యాయి. పట్టణంలో దుకాణాలన్నీ అమ్మకాలతో సందడిగా మారాయి. ముఖ్యంగా బేకరీలకు గిరాకీ బాగా పెరిగింది. జిల్లా కేంద్రంలోని ప్రధాన చౌరస్తాల్లో, హోటల్‌లు, రెస్టారెంట్లు విద్యుత్ కాంతులతో వెలిగిపోయాయి. అయితే డిసెంబరు 31 అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది విందు. డబ్బులు ఉన్నవారు లేని వారు అనే తేడా లేకుండా మద్యం, మాంసంతో విందు చేసుకోవడం ఆనవాయితీ. ఎప్పటి లాగానే ఈ ఏడాది కూడా విందుకు మద్యం, మాంసం, బేకరి పదార్థాలకు భారీగానే డిమాండ్ పెరిగింది. సాంధిపని విద్యాసంస్థలైన శ్రీగాయత్రి, విజన్ లాంటి ప్రైవేట్ కళాశాలలోని వసతి గృహాల్లో విద్యార్థులు సంబరాలను అంబరాలను తాకేలా నిర్వహించారు.



కేకులు తినిపించుకుంటున్న విద్యార్థినులు

ప్రజల్లోనే ఉంటున్న స్థానిక నాయకులు

ఈ కొత్త ఏడాదిలోనే స్థానిక సంస్థలు ఎన్నికలు జరిగే అవకాశం ఉండడంతో మరో మారు ప్రజాక్షేత్రంలో ఉండేలా రాజకీయ పార్టీలు ప్రణాళికలు రూపొందించుకుంటున్నాయి. గ్రామీణ స్థాయిలో ఆయా పార్టీలు చేపడుతున్న, చేపట్టిన, చేపట్టబోయే కార్యక్రమాలను వివరించడంతో పాటు ప్రజలకు ఏమైన సమస్యలు ఉంటే ఇట్టే పరిష్కరించేలా అధికారుల వద్దకు స్వయంగా వెళ్తున్నారు. పలువురు ఏకంగా న్యూయర్ వేడుకలను స్వయంగా ఏర్పాటు చేయించి దావత్‌లు ఇస్తు తాము ఈసారి బరిలో ఉండబోతున్నామని తమకు మద్దతు ప్రకటించాలనే సంకేతాలు ఇస్తున్నారు. ఏది ఏమైనా గత సంవత్సర స్మృతులను తలుచుకుంటూ 2025 నూతన సంవత్సరంకు జిల్లా ప్రజలు స్వాగతం పలికారు.



వైన్స్ వద్ద..



చికెన్ సెంటర్ వద్ద..



బీర్కూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న రాష్ట్ర అధికారి

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ సీఈ చైతన్య కుమార్

బీర్కూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజనీర్ చైతన్య కుమార్ సర్వే అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన బీర్కూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటికి తిరుగుతూ ఇందిరమ్మ ఇళ్ల సర్వేను చేపట్టాలన్నారు. ఇళ్లు లేని వారిని, అద్దె ఇళ్లల్లో ఉండే వారిని గుర్తించి వారికి న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. ఆయన వెంట పీడీ జైపాల్‌రెడ్డి, డీఈ గోపాల్, ఏఈ హన్మంత్ తదితరులు ఉన్నారు.

పుట్ట గొడుగుల్లా ఇటుక బట్టీలు

- యథేచ్ఛగా ఇటుక బట్టీల నిర్వహణ
- నిబంధనలకు తిలోదకాలు
- గ్రామాలకు అతి సమీపంలో రోడ్డు పక్కనే బట్టీలు
- కన్నెత్తి చూడని అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి



7

యువత విజయాలను కైవసం చేసుకోవాలి

- సింధూశర్మ, ఎస్పీ



యువత గత అనుభవాలను మననం చేసుకుంటూ నూతన సంవత్సరంలో మరింత పట్టుదల, కృషితో విజయాలను కైవసం చేసుకోవాలి. జయపజయాలను బేరీజు వేసుకుని మరింత ఉత్సాహంగా పని చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలి. నిన్నటికన్న మెరుగైన ఫలితాలు రాబట్టుకునేందుకు, వృత్తి నైపుణ్యాలకు మెరుగు పెట్టుకోవాలి. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తమ జీవిత ఆశయాలను నెరవేర్చుకోవాలి. జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బందికి 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు.

జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో విలసిల్లాలి

- ఆశిష్ సాంగ్వాన్, జిల్లా కలెక్టర్



జిల్లా ప్రజలు అన్ని రంగాల్లో రాణించి సుఖ సంతోషాలతో విలసిల్లాలి. గతానికి ప్రస్తుతానికి కాస్త తేడా ఉండాలి. మన పురోగతిని సమీక్షించుకోవాలి. అప్పుడే జీవితానికి అర్థం ఉంటుంది. లక్ష్య సాధనవైపు అడుగులు వేస్తు లక్ష్యం వైపు గురి పెట్టినప్పుడే జీవితంలో గెలుపు వైపు అడుగులు పడతాయి. యువత ఆ దిశగా ఆలోచన చేసి నూతన సంవత్సరాన్ని తమ జీవితానికి బంగారు బాటలు వేసేందుకు ఉపయోగించుకోవాలి. జిల్లా ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు.

మున్సిపల్‌ను మరింత అభివృద్ధి చేస్తా..

- గడ్డం ఇందుప్రియ, మున్సిపల్ చైర్‌పర్సన్, కామారెడ్డి



కామారెడ్డి పట్టణాన్ని కొత్త ఏడాదిలో మరింత అభివృద్ధి చేసేందుకు పాలకవర్గం, అధికారులతో కలిసి ముందుకు వెళ్తాం. ప్రస్తుతం పట్టణంలో అభివృద్ధి పనులు వేగిరంగా జరుగుతున్నాయి. ప్రజలు తమ ఆరోగ్యంపై దృష్టి సారించడంతో పాటు ఇతరుల ఆరోగ్యాలకు ఇబ్బందులు కలుగకుండా చెత్తను తమ ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ వాహనాలకు మాత్రమే అందించాలని కోరుతున్నాం. పట్టణ ప్రజలకు, మున్సిపల్ పాలకవర్గానికి, అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.



నిధులు మంజూరు చేయాలని మంత్రి సీతక్కకు వినతి



మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న వినయ్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్,డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో కొత్త రోడ్లు, బీటీరోడ్ల మరమ్మత్తు లకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు మంగళవారం ఆర్మూ ర్ నియోజ కవర్గ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసం లో వినయ్‌రెడ్డి మంత్రి సీతక్కను కలిసి నిధు లు మంజూరు చేయా లని విన్నవించారు. మ ంథని నుంచి రాం పూర్ వరకు రోడ్డు నిర్మాణా నికి రూ.4కోట్ల 40లక్షలు, మాక్లూర్ మండలం మెట్టు, గొట్టు ముక్కల మీదుగా లక్ష్మాపూర్ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.2కోట్ల 3లక్షలు, నందిపేట మండ లానికి రోడ్ల మరమ్మత్తులకు రూ.2 కోట్లు మం జూరు చేయాలని మంత్రిని కోరారు. వీటితో పాటు ఇతర అభివృద్ధి పను లకు నిధులు మంజూరు చేయాలని కోరగా స్పం దించిన మంత్రి సీతక్క రూ.19కోట్ల 87లక్షలు నిధులు మంజూరు చేశారు. నిధులు మంజూరు చేసిన మంత్రి సీతక్కకు వినయ్‌రెడ్డి ధన్యవా దాలు తెలిపారు.

వంద స్తంభాల ఆలయాన్ని పరిరక్షించాలి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): బోధన్‌పట్టణంలో ప్రఖ్యాతిగాంచిన చరిత్ర గల వంద స్తంభాల ఆలయాన్ని పరిరక్షించాలని హిందు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం బోధన్ పట్టణంలోని మహలక్ష్మి ఆలయంలో సమావేశం అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి మాట్లాడుతూ అతి పురాతనమైన వంద స్తంభాల ఆలయం వద్ద కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు విద్రోహ కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆలయ ప్రాంగణంలో చాదర్ పరిచి దర్గాను చిత్రీకరించే విధంగా చేస్తున్నారన్నారు. వెంటనే హిందు సంఘాల యువకులు స్పందించి పట్టణ సీఐకి సమాచారం అందించగా పోలీస్, రెవెన్యూ యంత్రాంగం ఘటన స్థలానికి చేరుకుని చాదర్‌ను తీసివేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొలిపాక బాలరాజు, వినోద్, రామరాజు, పవన్ కుమార్, కందికట్ల వాసు, శ్రీకాంత్, గౌతం, హన్మాండ్లు, సూరి, లింగం, హిందు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● ఆలయం వద్ద భారీ బందోబస్తు

వంద స్తంభాల ఆలయం వద్ద సోమవారం అర్ధరాత్రిచోటు చేసుకున్న ఘటనకు సంబంధించి మంగళవారం ఉదయం నుంచి పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. త్వరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపడతామని ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు.

కోటగిరిలో ఇందిరమ్మ ఇళ్ల రీ సర్వే



కోటగిరిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్

కోటగిరి,డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): కోటగిరి ఉమ్మడి మండలంలో ఇందిరమ్మ ఇళ్ల రీ సర్వే కొనసాగుతోంది. ఉమ్మడి మండలంలో పాత గోడలతో కూడిన ఇళ్ల సంఖ్య ఎక్కువగా నమోదు కావడంతో జిల్లా ఉన్నతాధికారులు రీ సర్వేకు ఆదేశించారు. కోటగిరి మండల కేంద్రంలో మంగళవారం ఆయా శాఖల అధికారులు ఇంటింటికి వెళ్లి రీ సర్వే చేశారు. గ్రామంలో పాత పెంకుటిల్లు, రేకుల షెడ్లు వంటి ఇళ్లను రీ సర్వే చేశారు. ఈ మేరకు సర్వే నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు మల్లయ్య, గంగాధర్, హౌసింగ్ డీఈ నాగేశ్వర్ రావు, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో చందర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 19, 24వార్డుల్లో రీ వెరిఫికేషన్‌ను పరిశీలించారు. ఆయన వెంట కౌన్సిలర్ రాము, సర్వేయర్ సలీం, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: నస్రులబాద్ మండలంలోని ఆయా గ్రామాలలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర హౌసింగ్ చీఫ్ ఇంజనీర్ చైతన్యకుమార్ అన్నారు.. మంగళవారం మండలంలోని దుర్కి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అధికారులతో కలిసి పరిశీలించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు ఇంటింటికి తిరుగుతూ, దరఖాస్తుదారుల వద్దకు వెళ్లి సొంత జాగా ఉన్నవారు, అదే ఇంట్లో ఉంటున్న వారి వివరాలను మొబైల్ యాప్ ద్వారా రెండవ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాలలో సర్వేను పూర్తి చేయాలని అధికారులకు సూచించడం జరిగిందన్నారు.. వారి వెంట మండల ప్రత్యేక అధికారి దయా నంద్, హౌసింగ్ పీడీ విజయ్ పాల్ రెడ్డి,ఇన్చార్జ్ ఎంపీడీవో సూర్యకాంత్, పంచా యతీ సెక్రెటరీసరిత, హౌసింగ్ ఏఈగోపి, అధికారులు,గ్రామస్తులు, తదితరులున్నారు.

నూతన సంవత్సర వేడుకలు

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాలక్ష్మీకాలనీలో స్మైల్స్ ది ప్లేస్కూల్‌లో విద్యార్థులు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కల్చరర్ డ్రెస్ కోడ్‌తో వివిధ రకాల అటలు ఆడి నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ షబాన గోహర్, డైరెక్టర్ రఫీ గోహర్, ఉపాధ్యాయులు సవీత, సిందుర, స్వప్న, సింధుజ, సరిత, ప్రసన్న, శ్రావణి, రోజా, రేష్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నుల పంపిణీ

వేల్పూర్, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీజడ్పీటీసీ రాకేష్‌చంద్ర మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతీ సంవత్సరం మాదిగానే వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అందుకు ఉపాధ్యాయులకు విద్యార్థులకు అన్ని రకాల ప్రేరణ కల్పించాలన్నారు. విద్యార్థులు పట్టుదలతో ఇష్టపడి చదువుతూ 10జీపీఏ సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ప్రిన్సిపాల్ ఇంద్రకరణ్, హెచ్‌ఎం రమేస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సారెడ్డి, నాయకులు, గుడాల మోహన్, టక్కురి గంగాధర్, నర్సారెడ్డి, సంజీవ్, సత్యనంద్, తదితరులు ఉన్నారు.

నూతన కమిటీ నియామకం

భీమ్‌గల్, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కోకన్వీనర్ అంగరి ప్రదీప్ అధ్యక్షతన మంగళవారం మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భీమ్‌గల్ మండలంలోని 20గ్రామాల గ్రామస్థాయి కమిటీలను ప్రకటించారు. ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండల అధ్యక్షునిగా రవీందర్ బీమా ప్రధానకార్యదర్శిగా కార్తిక్,కోశాధికారిగా దినేష్,ఉపాధ్యక్షులుగా సూర్యం, రాములను నియమించారు.

రూ.10వేల ఆర్థిక సహాయం

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజారాంనగర్‌కాలనీలో ఈఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం చౌల్ అశోక్ కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల చౌల్ అశోక్ గుండెపోటుతో మృతి చెందగా కుటుంబానికి పెద్దదిక్కు కోల్పోయినందున అశోక్ కుటుంబానికి అండగా ఉంటామని ఈఆర్ ఫౌండేషన్ ట్రస్ట్ ఛైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అర్గుల్ సురేష్, జక్కుల చంద్రశేఖర్, గుజరాతి శ్రీనివాస్, సడాక్ ప్రమోద్, దొండి గంగామోహన్, కౌన్సిలర్ బదం రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సునీల్‌కుమార్ జన్మదిన వేడుకలు



మోర్తాడ్‌లో రక్తదానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోర్తాడ్, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ప్రజానిలయంలో మంగళవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, అభిమానులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు 50మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం సునీల్ కు మార్ జన్మదిన కేక్‌ను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముత్యాల రాములు, ఎఎంసీ చైర్మన్ పాలెం నర్సయ్య, మాజీ ఎంపీపీ శివలింగు శ్రీనివాస్‌లు కేక్‌కట్ చేశారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్య క్షుడు ము త్యాల రాములు, పాలెపు నర్సయ్య, శివలింగు శ్రీనివాస్, మం డల యువ జన కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్వాల మనో జ్, జక్కం అశోక్, పుప్పాల అ శోక్, గిర్మాజీ గోపి,శ్రీనివాస్, సంతోష్, సుదీర్, శ్రీధర్,మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండల కేంద్రంలోని కేజీబీవీలో మంగళవారం బా ల్కొం డ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ జన్మదిన వేడు కలను మండలంలోని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. .ఈ కార్యక్రమంలో మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొ న్నారు.

కమ్మర్‌పల్లి: మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సనీల్‌కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మండల కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో కమ్మర్‌పల్లి, హసాకొత్తూర్ గ్రామాలలో గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు నిత్యవసర సరుకులు నిర్వహించారు.

ముప్కాల్: ముప్కాల్, బాల్కొండ మండలాల్లో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ జన్మదిన వేడుకలను మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ జన్మదిన కేక్ చేసీ కాంగ్రెస్ నాయకులు స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులుశ్రీకాంత్, బోజారెడ్డి, ముత్తెన్న, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుడిని నమ్మించి రూ.4వేలతో ఉడాయించిన దుండగుడు

ఎడపల్లి, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండల కేంద్రంలోని ఓ వికలాంగుడికి చెందిన 4వేల రూపాయలను ఓ దుండగుడు కాజేసిన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన గుండారం నడ్పి సాయిలు అనే వికలాంగుడు ఎడపల్లి పోస్టాఫీసులో తన వికలాంగుల పెన్షన్ 4వేల రూపాయలను తీసుకుని బయటకు వస్తుండగా ఇది గమనించిన ఓ దుండగుడు బాధితునితో మాటలు కలిపి నీకు వికలాంగుల పెన్షన్ 4వేలతో పాటు అదనంగా తహసీల్దార్ కార్యాలయంలో 12వేలు వస్తాయని నమ్మించి నాతో మండల తహసీల్దార్ కార్యాలయానికి వస్తే 12వేలు ఇప్పిస్తానని నమ్మించగా, అది నిజమే అని నమ్మిన వికలాంగుడు అతని వెంట మండల కార్యాలయాల సముదాయ ఆవరణలోకి దుండగుడితో కలిసి వెళ్లాడు. ఇంతలో దుండగుడు తన వెంట తెచ్చుకున్న కెనరా బ్యాంకు విత్‌డ్రా ఫారంను అతనికి ఇచ్చి ఇక్కడ సంతకం చేయ నీకు డబ్బులు ఇప్పిస్తాను అని అనగా అది నమ్మిన వికలాంగుడు ఆ విత్‌డ్రా ఫారంపై సంతకం చేశాడు. ఆఫారాన్ని బాదితుడికి అందించిన దుండగుడు కార్యాలయంలో 3వందలు ఇవ్వాలని చెప్పి 3వందలు ఇవ్వమని అడగగా బాదితుడు నాదగ్గర చిల్లర లేదు 5వందల నోట్లు ఉన్నాయని తెలుపగా చిల్లర తీసుకు వస్తానని చెప్పి బాదితుడి దగ్గర ఉన్న 4వేలను తీసుకుని మండల కార్యాలయ సముదాయాల ఆవరణనుండి బయటుకువెళ్లి 4వేలతో ఉడాయించాడు. ఎంతకూ దుండగుడు తిరిగి రాకపోయే సరికి బాధితుడు తను మోసపోయానని తెలుసుకుని ఏడుస్తూ కార్యాలయ ఆవరణలో ఉన్న బేంచీపై ఏడుస్తూ కూర్చున్నాడు. సదరు కార్యాలయానికి పని నిమిత్తం వచ్చిన స్థానికులు అతనిని గమనించి కులుగ చేసుకుని బాధితుడిని వివరాలు అడగగా తనకు జరిగిన మోసం గురించి వివరించి బోరున విలపించాడు. వెంటనే స్థానికులు సదరుబాదితుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వెల్లగా బాదితుడు తనకు జరిగిన మోసంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.



మోసపోయిన వికలాంగుడు గుండారం నడ్పి సాయిలు

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ శ్రావణ్ కుమార్

రెంజల్,డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగం గౌడ్, కిషోర్ కుమార్‌ల ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎంపీడీవో వెంకటేష్, ఎంఈవో ఆంజనేయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో పీఆర్‌టీయూ ఎప్పుడు ముందుంటుందని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పీఆర్‌టీయూ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ శ్రీనివాస్, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఇల్తెపు శంకర్, నరసింహ రెడ్డి. పీఆర్‌టీయూ నాయకులు కృష్ణ, నాందేవ్, శంకర్, శ్రీనివాస్ రెడ్డి, తాహెర్, వినోద్, శ్రీనివాస్, రఫీక్ ఉల్ అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: మండల పీఆర్‌టీయు నాయకులు 2025నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మంగళవారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి చేతుల మీదుగా విష్కరించి ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజేశ్వర్, ప్రధానకార్యదర్శి కిషన్, మండల కార్యదర్శి రామిరెడ్డి, నందిపేట మండల అధ్యక్షుడు భూషణ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు: రుద్రూరు మండల కేంద్రంలో సమీకృత మండల సముదాయ భవనం ఎదుట మంగళవారం పీఆర్‌టీయూ నూతన క్యాలెండర్‌లను తహసీల్దార్ తారాబాయి, ఎంపీడీవో సురేష్ బాబులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూ ముందుండి పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, పీఆర్‌టీయూ అధ్యక్షులు విఠల్ రెడ్డి, కార్యదర్శి దస్తాగిరి, రాష్ట్ర కార్యదర్శులు రమేష్, ఇంతియాజ్, హైమద్, వీరేశం, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: 2025వ సంవత్సర క్యాలెండర్‌ను నసురుల్లాబాద్ మండల విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం మండల విద్యాధికారి చందర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు జి.హన్మాండ్లు, ప్రధాన కార్యదర్శి ఎస్. శ్రీచంద్, రాష్ట్ర బాధ్యులు వెంకాగౌడ్, హన్మాండ్లు యాదవ్, శ్రీనివాస్, మండల బాధ్యులు సంజీవులు, శ్రీనివాస్‌గౌడ్, పండరీగౌడ్, బాల్‌రాజ్‌లు పాల్గొన్నారు.



పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

అయ్యప్ప దీక్షతో సకల శుభాలు



అయ్యప్ప స్వామి ఆలయంలో స్వాములు

బోధన్‌రూరల్,డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దీక్ష కఠోరమైనదని, అయ్యప్ప దీక్షతో సకల శుభాలు కలుగుతాయని అయ్యప్ప ఆలయ పూజారి సంతోష్ శర్మ అన్నారు. మంగళవారం బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో ఏకచక్రపురి ధర్మశాస్త్ర ఆలయ పూజారి సంతోష్ శర్మను అయ్యప్ప స్వాములు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప దీక్ష చాలా కఠోరమైనదని, అయ్యప్ప దీక్షతో సకల శుభాలు కలుగుతాయన్నారు. 18మెట్లకు పూజలు నిర్వహిస్తే దోషాలు తొలగించి శుభాలు కలుగుతాయన్నారు. నిత్యం అయ్యప్ప నామ స్మరణ జరిపిస్తే సకల శుభాలు కలుగుతాయన్నారు. అనంతరం రెండుసార్లు శబరిమలైకు మహ పాదయాత్రగా వెళ్లిన సత్యం, తదతర గురుస్వాములను సన్మానించారు.ఈ కార్యక్రమంలో గురుస్వాములు,అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ అభిమాన సంఘ అధ్యక్షుడిగా శివన్నారాయణ



ఎన్‌టీఆర్ విగ్రహం నిర్మాణం కోసం విరాళం అందజేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షులుగా పల్లెంపాటి శివన్నారాయణ మంగళవారం ఎన్నికయ్యారు. బోధన్ పట్టణంలోని రాకాసిపేటలో గల అయ్యప్ప కమాన్ ఎదురుగా ఉన్న బొప్ప శ్రీను హాల్‌లో ఎన్‌టీఆర్ అభిమానుల సమావేశం నిర్వహించారు. ఎన్‌టీఆర్ అభిమాన సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పల్లెంపాటి శివన్నారాయణ, ఉపాధ్యక్షులు సాంబిరెడ్డి, కోట గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పీ.గాంధీ, సంయుక్త కార్యదర్శులుగా ఏశాల రవీందర్, కృష్ణారెడ్డి, కోశాధికారిగా కృష్ణ మోహన్, కార్యవర్గ సభ్యులుగా సాంబశివరావు, పాండురంగారెడ్డి, బాల్‌రెడ్డి, జీవన్ రెడ్డి, బాలస్వామి, సూరిబాబు, రామారావు, రావెళ్ల శ్రీనివాస్, బ్రహ్మయ్య, సుధాకర్, పావులూరి వెంకటేశ్వర్‌రావు, సలహాదారులుగా అమర్‌నాథ్ బాబు, తూము శరత్ రెడ్డి, రాజేశ్వర్ పటేల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఎన్‌టీఆర్ విగ్రహం నిర్మాణం కొరకు అమర్‌నాథ్ బాబు 100116 విరాళాన్ని అందజేశారు. పాండురంగారెడ్డి 10వేల రూపాయలు విరాళంగా అందించారు.

అంగన్‌వాడి కేంద్రాన్ని పరిశీలించిన కమిషనర్

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి 24వార్డులో అంగన్‌వాడి కేంద్రాన్ని మంగళవారం మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. అంగన్‌వాడి కేంద్రంలో పిల్లల సంఖ్య తక్కువగా ఉండడంతో సంబంధిత అంగన్‌వాడి టీచర్‌తో ఫోన్‌లో మాట్లాడి పిల్లల ప్రతీఒక్కరు కేంద్రానికి వచ్చే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వం ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు ఉన్నారు.

ఆలూర్‌లో కాలేజీ నిర్మాణానికి స్థల పరిశీలన



ఆలూర్‌లో కళాశాల నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న డీఐఈవో

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలో జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి మంగళవారం డీఐ ఈవో రవి కుమార్ స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ఆలూర్ మండల కేంద్రానికి ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేసింది. దీనిలో భాగంగా నూతనంగా నిర్మించిన జూనియర్ కళాశాల భవనానికి స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో నరేందర్, బాల్కొండ కళాశాల ప్రిన్సిపాల్ రజీయుద్దిన్, కాంగ్రెస్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు వినయ్, గిరిష్, వీడీసీ అధ్యక్షుడు బార్ల ముత్యం, తదితరులు ఉన్నారు.

డొంకేశ్వర్: గ్రామీణస్థాయి విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించే ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం డొంకేశ్వర్ మండల కేంద్రానికి ఇంటర్ కళాశాల మంజూరు చేసింది.కళాశాల ఏర్పాటు కోసం మంగళవారం సంబంధిత అధికారులు మండల కేంద్రానికి వచ్చి గ్రామ స్థులతో సమావేశమై కళాశాల ఏర్పాటుపై చర్చించారు. ఎక్కడ ఏర్పాటుచే యాలని అంశంపై సంబంధిత అధికారులు, గ్రామస్థులతో కలిసి స్థల పరిశీలన చేశారు.ఈకార్యక్రమంలో గ్రామస్థులు, స్థానికనాయకులు ఉన్నారు.

'ప్రపంచ గణిత మేధావి రామానుజన్'

ఏర్గట్ల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ గణిత మేదావి శ్రీనివాస రామానుజన్ అని హయగ్రీవ పాఠశాల కరస్పాండెంట్ ఎస్ అలివేణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని హయగ్రీవ పాఠశాలలో గణిత మేళా ఘనంగా నిర్వహించారు.నిజ జీవితంలో గణితం దాని ప్రాముఖ్యతను కరస్పాం డెంట్ అలివేణి విద్యార్థులకు వివరిం చారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలోని టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పద్మశాలీలు అన్ని రంగాలలో రాణించాలి

నవీపేట,డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): పద్మశాలీ కులస్తులు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాలలో రాణించాలని మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ మాసిని వినోద్ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని పద్మశాలి సంఘంలో పద్మశాలి సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు లోల శంకర్ మాట్లాడుతూ పద్మశాలి కులస్తులు ఐక్యతతో ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి పట్టణ కమిటీ అధ్యక్షులు గుర్రం సంతోష్, మాజీ అధ్యక్షులు దేవిదాస్, జిల్లా సభ్యులు సురేష్, కార్యవర్గ సభ్యులు, పద్మశాలి కులస్థులు పాల్గొన్నారు.

మండల బూత్ కమిటీల సమావేశం

నసురుల్లాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు సున్నం సాయిలు అధ్వర్యంలో నసురుల్లాబాద్ మండల బూత్ కమిటీల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నీలం రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రతి గ్రామంలో బూత్, ప్రముఖల కమిటీలు తొందరగా వేయాలని, వారి పూర్తి చిరునామా రాసి వారి ఫొటో కూడా జత చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు దొరబాబు, కామారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి చందూరి హన్మాండ్లు, జిల్లా ఓబీసీ కార్యవర్గ సభ్యులు వడ్ల సతీష్, మండల ప్రధాన కార్యదర్శి మేకల రామన్న యాదవ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు జి. యాదగిరి గౌడ్, శక్తి కేంద్రం ఇంచార్జి కొమ్ము ధనుంజయ్, బూత్ అధ్యక్షుడు మనూరు సాయిలు, బత్తిని రాజు, ఉశ్లేంగా గోపి, ఉశ్లేంగా పర్వయ్య, బల్విర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనోత్పత్తిలో నూతన పద్ధతులను పాటించాలి

నవీపేట,డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): నవీపేట మండల శివారులోని పొలాల్లో సాగు పద్ధతులను మంగళవారం మండల వ్యవసాయ శాఖ అధికారి నవీన్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనోత్పత్తిలో నూతన పద్ధతులను అలవంబించాలని సూచించారు. నూతనంగా అనుసరిస్తున్న సాగు పద్ధతులను గమనించి వరి సాగులో నాట్ల సమయంలో చేపట్టవాల్సిన చర్యల గురించి వివరించారు. ఆయన వెంట ఏఈవోలు వినోద్, వసంత్, రైతులు తదితరులున్నారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

బోధన్‌రూరల్,డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని కమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన గంగన్ విష్ణు(20) అనే యువకుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య యత్నానికి పాల్పడినట్లు బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జీవితంపై విరక్తితో గంగన్‌విష్ణు అనే యువకుడు పురుగుల మందు సేవించి సోమవారం అర్ధరాత్రి అపస్మారక స్థితికి చేరుకుని మృతి చెందినట్లు ఆయన తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

'ఆంధ్రజ్యోతి' కథనంపై సబ్ కలెక్టర్ ఆరా



దుర్కిలో తవ్వకాలు చేపట్టిన స్థలాన్ని పరిశీలిస్తున్న మైన్స్, రెవెన్యూ అధికారులు

నసురుల్లాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలంలోని ఆయా గ్రామ శివారులలో కొనసాగుతున్న అక్రమ మొరం తవ్వకాలు, రవాణా జరుగుతున్న విషయాన్ని, మొరం మాఫియా పై గత వారం రోజుల నుంచి ఆంధ్రజ్యోతి ప్రచురిస్తున్న వరుస కథనాలకు బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి స్పందించారు జెసిబి టిప్పర్ జాడెక్కడా అనే కథనానికి స్పందించిన సబ్ కలెక్టర్ కిరణ్మయి స్వయంగా మైన్స్ అధికారులకు ఫోన్ చేసి నసురుల్లాబాద్ మండలం లోని ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న అక్రమ మొరం తవ్వకాలు చేపడుతున్న స్థలాన్ని పరిశీ లించి మొరం మాఫియాపై కొరడా జులిపించాలని మైన్స్ అధికారులకు ఆదేశించారు. స్పందించిన మైన్స్ ఎడి నాగేష్ రెవెన్యూ అధికారులతో కలిసి మంగళవారం మండలానికి చేరుకొని దుర్కి గ్రామశివారులో అక్రమ మొరం తవ్వకాలు చేపట్టిన స్థలాన్ని పరిశీలించారు.. మైన్స్ ఎడి నాగేష్ మాట్లా డుతూ మొరం అక్రమ తవ్వకా లు చేపట్టిన, మొరం తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకుం టామని అన్నారు.. అదేవిధంగా అక్రమ తవ్వకాలు చేపట్టిన జెసిబి, మొరం లోడ్ టిప్పర్, డ్రైవర్ రెవెన్యూ అధికా రుల కనుకప్పి పరారైన విషయాన్ని స్థానిక ఎమ్మెల్లావణ్యను అడిగి తెలుసుకున్నారు. అక్రమ మొరం దందాకు పాల్పడిన జెసిబి, టిప్పర్ పై, డ్రైవర్‌పై విచారణ చేసిచర్యలు తీసుకో వాలని అన్నారు. మైన్స్ అధికారుల వెంట తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ బావయ్య, ఆర్ఐ సాయిలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వాహనాల విస్తృత తనిఖీలు

భీమ్‌గల్, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని ప్రధాన కూడళ్ళ వద్ద ఆర్మూర్ మోటర్ వెహికిల్ ఇన్స్‌పెక్టార్ వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో మంగళ వారం వాహనాలను విస్తృత తనిఖీ చేపట్టారు. ఓవర్‌లోడ్‌తో వెళ్తు పత్రాలు సక్రమంగా లేని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇట్టి వాహ నాలకు జిల్లా కేంద్రంలోని డీటీవో కార్యాలయంలో జరిమానాలు విధించనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలో అసిస్టెంట్ మోటర్ వెహికిల్ ఇన్స్‌పెక్టార్ సాగర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

లింగాపూర్ మహాలక్ష్మి ఆలయంలో చోరీ

నవీపేట,డిసెంబరు31(ఆంధ్రజ్యోతి):మండలంలోని లింగాపూర్ గ్రామంలో గల మహలక్ష్మి అమ్మవారి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. అమ్మవారి ముక్కు పుడుక, పుస్తెలు సుమారు తులం వరకు ఉంటాయని, అమ్మవారి వెండి వడ్డెణం ఆరు తులాల వరకు ఉంటుందని, వీటిని గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గంగాధర్ నవీపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ వినయ్ కుమార్ మాట్లాడుతూ సీసీ పుటేజీల ద్వారా అన్ని కోణాల్లో విచారణ జరిపించి త్వరలోనే దొంగలను పట్టుకుంటామన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

రెంజల్,డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలా జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో వెంకటేష్, సూపరిండెంట్ శ్రీనివాస్‌లు పరిశీలించారు. ప్రభుత్వం అందించే మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం తీరును పరిశీలించారు.కందకుర్తి పాఠశాలలో తహసీల్దార్ శ్రావణ్ కుమార్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఉపాధ్యాయుల హాజరుపట్టికను పరిశీలించారు.ఆయన వెంట హెచ్‌ఎం ఇల్తెపు శంకర్,టీచర్లు ఆనంద్ తదితరులున్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

రెంజల్,డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): రెంజల్ మండలంలోని వీరన్నగుట్ట తండాలో ఇరువర్గాల మధ్య జరిగిన గొడవలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా వారిని కుటుంబ సభ్యులు నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రెంజల్ మండలంలోని వీరన్నగుట్ట తండాలో ప్లాట్ స్థలం విషయంలో ఫకీరా, రాథోడ్ మంత్య కుటుంబాల మధ్య గొడవ జరగగా ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఫకీరా అతని కుటుంబ సభ్యులు వసీరామ్, జమ్మక్కలు కలిసి కట్టెలతో రాథోడ్ మంత్య, అతని భార్య జన్నుబాయి, తల్లి మీరాబాయిపై దాడి చేశారు. ఈ సంఘటనలో రాథోడ్ మంత్య, అతని భార్య జన్నుబాయి, తల్లి మీరాబాయి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానికులు, కుటుంబ సభ్యులు నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. రాథోడ్ జన్నుబాయి ఫిర్యాదు మేరకు ఫకీరాపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు.

చింతలూర్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

జక్రాన్‌పల్లి, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలూర్ గ్రామానికి చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం కొలిప్యాక్ సింగిల్ విండో ఛైర్మన్ నాగుల శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ అభిలాష్, చింతలూర్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పుప్పాల గంగాధర్, మాజీఉపసర్పంచ్ జలంధర్, కాంగ్రెస్ నాయకులు హన్మాండ్లు, నాగుల లింబాద్రి, శ్రీనివాస్, చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫేటా..ఫేట్...

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

● 'ఆంధ్రజ్యోతి'తో రెంజల్ ఎస్సై సాయన్న



ఆంధ్రజ్యోతి: మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు !?

ఎస్సై: రెంజల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడ.. ఏ చిన్న ఘటన జరిగినా వెంటనే అలర్ట్ అవుతున్నాం. మున్ముందు కూడా ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు.

ఆంధ్రజ్యోతి: కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా తనిఖీలు చేపట్టారా !?

ఎస్సై: ఇప్పటికే గత రెండు రోజులుగా వాహనాల తనిఖీలు చేపట్టాం. న్యూ ఇయర్ రోజున కూడా స్పెషల్ డ్రైవ్ చేపడతాం. ఎవరైనా తాగి రోడ్డుపైకి వస్తే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: న్యూఇయర్ రోజున యువతకు మీరిచ్చే సందేశం ఏంటి !?

ఎస్సై: ఎలాంటి వేడుకలనైనా జరుపుకోవడంలో తప్పు లేదు. కానీ అది ఎదుటివారికి ఇబ్బంది కలిగించకూడదు. యువత కూడా నానా హంగామా చేయకుండా.. ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు, సమయం ప్రకారం వేడుకలను జరుపుకోవాలి. అలాగే జీవితంలో కూడా ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగి ఉన్నత స్థాయిని చేరుకోవాలి.

● (ఆంధ్రజ్యోతి, రెంజల్)



డిచ్‌పల్లిలో విక్రయిస్తున్న కేకులు

జోరుగా కేకుల విక్రయాలు

● కొనుగోళ్లతో కిక్కిరిసిన మేకల మండి



డిచ్‌పల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): 2025 ఆంగ్ల నూతన సంవత్సరం స్వాగతానికి డిచ్‌పల్లి మండలవ్యాప్తంగా యువత, చిన్నారులు, ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం సాయంత్రం నుంచే కేకుల విక్రయాలు జోరుగా కొనసాగాయి పలు డిజైన్లతో అందమైన కేకులను వ్యాపారస్థులు తయారు చేసి విక్రయాలు చేశారు. డిచ్‌పల్లి శివారులోని నాగపూర్ గేటు వద్ద మేకల విక్రయాలు జోరుగాసాగాయి పలు గ్రామాలు, మండలాల నుంచి తరలివచ్చి ప్రజలు కొనుగోళ్లు చేశారు. కేకులు, టపాసులు, బాణసంచలు, కోడిమాంసం విక్రయాలు మేకల విక్రయాల జోరు కనబడింది. పోటాపోటీన నిర్వాహకులు తక్కువ రేట్లకు విక్రయిస్తు కస్టమర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేశారు. టీయూ, ఏడో పోలీస్ బెటాలియన్‌లో యువత వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.



మండల కేంద్రంలో జోరుగా మేకల విక్రయాలు



ఆంధ్రజ్యోతి పరిశీలన



ఎల్లారెడ్డి - కామారెడ్డి ప్రధాన రహదారి పక్కన ఇటుక బట్టీలు

పుట్టగొడుగుల్లా ఇటుక బట్టీలు!

● యథేచ్ఛగా ఇటుక బట్టీల నిర్వహణ ● నిబంధనలకు తిలోదకాలు ● గ్రామాలకు అతిసమీపంలో రోడ్డు పక్కనే బట్టీలు ● కన్నెత్తి చూడని అధికారులు ● ప్రభుత్వ ఆదాయానికి గండి

ఎల్లారెడ్డి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలంలోని వివిధ గ్రామాల్లో అనుమతులు లేని ఇటుక బట్టీలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఇటుక బట్టీలను, గ్రామాలకు అతిసమీపంలోనే కాకుండా ఎల్లారెడ్డి- కామారెడ్డి ప్రధాన రహదారి పక్కన నిర్వహించడం గమనార్హం. బట్టీల నిర్వహణతో సమీప గ్రామాలలోని ప్రజలకు రోడ్డుపై ప్రయాణించే ప్రయాణీకులకు ఇబ్బంది అధికంగామారింది. నిబంధనలకు విరుద్ధంగా బట్టీలు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. గ్రామాలలో పలుకుబడి ఉన్న కొంతమందిని మచ్చికచేసుకోవడం వారిఅండదండలతో ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్న అటువైపు అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు.

● నిబంధనలకు విరుద్ధంగా..

ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కిన బట్టీల నిర్వాహకులు ఇష్టానుసారంగా గ్రామాల అతిసమీపాన నిర్వహిస్తున్నారు. అడవుల నుంచి యధేచ్ఛగా కలపని తరలించడం, చెరువుల నుంచి మట్టిని అక్రమంగా తరలించి బట్టీలు నిర్వహిస్తున్నారు. గ్రామాలకు అతిసమీపంలో బట్టీలు కాలుస్తున్న సమయాన వచ్చే పొగతో ప్రజలు నానా రకాల ఇబ్బందులు పడాల్సి వస్తుంది. బట్టీలను కాల్చడానికి కలపను తరలించడంతో అడవులు అంతరించిపోయే ప్రమాదం ఉంది. దీంతో భవిష్యత్తులో ఈ పర్యావరణానికి అటు ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఎల్లారెడ్డి - కామారెడ్డి ప్రధాన రహదారి పక్కన లక్ష్మాపూర్ గ్రామ సమీపనా రోడ్డు పక్కనే బట్టిల నిర్వహణ



బట్టీల వద్ద వేసిన కలప

కొనసాగుతోంది. బట్టీల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా అధికారులకు మామూళ్లు ఇచ్చి తమపని కానిచ్చేస్తున్నారని ఆరోపణ వస్తున్నాయి.

● పట్టించుకోని అధికారులు

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రామాలకు అతి సమీపంలోని ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రధాన రహదారి పక్కనే బట్టీలు ఉన్న అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు ఉన్నాయి. కాలుష్యం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్న ఏ మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీసం గ్రామాలలో నిత్యం సందర్శించే ఆయా గ్రామాల కార్యదర్శులు కూడా రెవెన్యూ అధికారులు సైతం అటు వైపు వెళ్లకపోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో వారికే తెలియాలి. అధికారుల అలసత్వం బట్టిల నిర్వాహకుల అత్యాశతో పంచాయతీ ఆదాయానికి గండి పడుతుందనేది జగమెరిగిన సత్యం, ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి అక్రమ ఇటుక బట్టీలను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● ఇటుక బట్టీలకు నిబంధనలు

ఎక్కడైన ఇటుక బట్టీలు నిర్వహించాలంటే ముందుగా సంబంధిత గ్రామ పంచాయితీ కార్యదర్శుల నుంచి నిర్వహణకు సంబంధించిన అనుమతి పత్రం తీసుకోవాలి. అది కూడా కార్యదర్శి క్షేత్రస్థాయికి వెళ్లి బట్టి నిర్వహణ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేదని ధృవీకరించిన తరువాతనే అనుమతి మంజూరు చేయాలి. అప్పుడు కొన్ని శరతులతో కూడిన అనుమతితో బట్టీలు నిర్వహించుకోవచ్చు. అలాగే బట్టీలను కాల్చడానికి ఉపయోగించే కల్పకు సంబంధించిన అడవీశాఖ అధికారులు అనుమతి ఇవ్వాలి. విద్యుత్‌ను వాడుకోవడానికి విద్యుత్ శాఖ అనుమతి, మట్టి తోలుకునేందుకు మైనింగ్ శాఖ నుంచి అనుమతి, భూమి, నాలా కన్వర్షన్ తప్పనిసరిగా ఉండాలి. జన సంచారం ఎక్కువగా లేని ప్రాంతాలలో పరిమితి దూరంలో నిర్వహించుకోవాలి.

వైభవంగా అయ్యప్పస్వామి మండలపూజ

భక్తి





అయ్యప్ప స్వామి అభరణాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న దృశ్యం

కామారెడ్డి టౌన్, డిసెంబరు 31: కామారెడ్డి జిల్లాకేంద్రంలోని అయ్యప్ప స్వామి 35వ మండల పూజ మహోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, గణపతిహోమం, ఉషఃపూజ నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఆలయం నుంచిస్వామి అభరణాలను బాస రఘుకుమార్, నీలరాజు, మోట్కూరి శ్రీనివాస్ అయ్యప్ప మాలదారులు సింగారి మేళంతో పెద్దఎత్తున పాల్గొని నృత్యాలు చేస్తూ పట్టణ ప్రధాన వీధుల గుండా తిరిగి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. భక్తుల సహకారంతో తయారు చేసిన సుమారు 45 తులాల అయ్యప్ప బంగారు కిరీటాన్ని అయ్యప్పస్వామికి పట్టభిషేకం చేసి తొడిగించారు. సహస్రకలభిషేకం, విశేష అభరణములతో స్వామివారికి అలంకరణ,సర్వబలి, హారతి, పడి హారతి, సాయంత్రం దీపాలంకరణ, అయ్యప్ప స్వామికి చక్రస్నానం, ధ్వజారోహణ కార్యక్రమం, పుష్పాభిషేకం కార్యక్రమాలు చేపట్టారు. కేరళ సహాయ అర్చకులుఉన్నికృష్ణన్ నంబుద్రి, ఆలయ అర్చకులు కన్నయ్య, వేదపండితుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతీ ఏడాది మండల పూజ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పూజ కార్యక్రమాలకు భక్తులు భారి సంఖ్యలో తరలివచ్చి అయ్యప్ప స్వామి ఆశీస్సులు పొందారని తెలిపారు.ఈ కార్యక్రమంలో అయ్యప్ప కార్యనిర్వహణ అధ్యక్షుడు పట్నం రమేష్, ఆలయ అధ్యక్షుడు నస్కంటి శ్రీనివాస్, అన్నదానం సమితి అధ్యక్షుడు రాజేందర్,నూకల ఉదయ్, డా॥శ్రీనివాస్, కమిటి సభ్యులు,అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.



బైరాపూర్ విండో ఎదుట నిరసన కూర్చున్న అంజనీబాయి

పంట రుణం కోసం విండో ఎదుట మహిళా రైతు నిరసన

బీర్కూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పంట రుణం కోసం ఓ మహిళా రైతు బైరాపూర్ సొసైటీ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన చేపట్టింది. నస్రుల్లాబాద్ మండలం బొప్పస్ పల్లి తండాకు చెందిన అంజనీ బాయికి రుణమాఫీ వర్తించింది. కొన్ని రోజుల అనంతరం తాజాగా పంటరుణం తీసుకునేందు కోసం బైరాపూర్ సహకార సంఘం కార్య దర్శిని సంప్రదించింది. రుణం పొందడానికి కావలసిన పత్రాలు, పట్టా పాస్‌బుక్ జీరాక్స్ పత్రాలు అందజేయాలని సెక్రటరీ సూచించాడు. అన్ని పత్రాలు అందించినా తనకు పంట రుణాలు ఇవ్వడం లేదని అంజనీబాయి ఆరోపించింది. మంగళవారం బైరాపూర్ సొసైటీ ఎదుట బైఠాయించి నిరసన తెలిపింది. రుణమాఫీ అయినా అధికారులు పట్టించుకోవడం లేదని, తిరిగి పంట రుణాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. రుణం ఇవ్వకుంటే తనకు ఆత్మహత్యే శరణ్యమని అంజనీ బాయి పేర్కొంది.

పట్టాపాస్ బుక్కులు ఇవ్వలేదు..

● విండో కార్యదర్శి భూమయ్య

అంజనీబాయి తన వ్యవసాయ భూమికి సంబంధించిన పట్టా పాస్‌బుక్ అందించలేదు. పూర్తి పత్రాలు అందించాకే పంట రుణం అందిస్తామని చెప్పాం.

నీటిశుద్ధి యంత్రానికి మరమ్మతులెప్పుడో?



కేజీబీవీ పాఠశాలలో పనిచేయని నీటిశుద్ధి యంత్రం

● ఐదేళ్లుగా మరమ్మతుకు నోచుకోని వైనం
● పట్టించుకోని అధికారులు ● అధికారులు వెంటనే స్పందించి యంత్రాన్ని బాగుచేయించాలి: విద్యార్థుల తల్లిదండ్రులు

సిరికొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) విద్యార్థులకు శుద్ధమైన మంచినీటిని అందించేందుకు ఏర్పాటుచేసిన నీటిని శుద్ధి చేస్తే చేసే యంత్రం ఐదేళ్లుగా మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా మారింది. దానికి మరమ్మతులు చేయించాలనే ధ్యాసే కలుగకపోవడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. మండలంలోని అన్నాపూర్ణేశ్వరీ కాలనీలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆరేళ్ల క్రితం ఏర్పాటు చేసిన నీటిశుద్ధి యంత్రం ఆరునెలలు, ఏడాదికాలం మాత్రమే పనిచేసిందని సమాచారం. యంత్రం పాడైపోయి ఐదేళ్ల గడిచి పోయిన మరమ్మతు చేయించి విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యాన్ని అధికారులు మరిచిపోవడం బాధకరం. నీటిశుద్ధి యంత్రం పనిచేయడం మానివేసిన నాటి నుండి విద్యార్థులకు తాగడానికి ప్యూరీఫైడ్ నీటిని కొనుగోలు చేస్తున్నట్లు ప్రత్యేక అధికారి పర్వీన్ బేగం తెలిపారు. ఐదేళ్ల నుండి నీటిని కొనుగోలు చేస్తున్నారు. నీటిశుద్ధి యంత్రం పని చేయదని తెలిసినా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నీటిశుద్ధి యంత్రం పని చేయడం లేదని తెలిసిన విద్యాశాఖ అధికారులు గాని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు గాని పట్టించుకున్న పాపాన పోలేదు. విద్యార్థులకు మంచినీటిని అందించడంలో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. అధికారులకు లేక పోయిన ప్రజా ప్రతినిధులు కూడ గిరిజన బాలికలంటే ఇంత నిర్లక్ష్యం చూపించడమేమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. గత ఐదేళ్ల స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు సైతం గిరిజన తెగకు చెందిన వారున్న ఎవరూ కూడా నీటిశుద్ధి యంత్రాన్ని బాగుచేయించడలంలో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నీటిశుద్ధి యంత్రాన్ని బాగుచేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు. విద్యా ప్రభుత్వం మారిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పాడైపోయిన నీటి శుద్ధి యంత్రాన్ని విద్యా శాఖ ఉన్నాతాధికాలు స్పందించి బాగు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి స్పందించి నీటి శుద్ధి యంత్రాన్ని మరమ్మతు చేయించి స్వచ్ఛమైన నీటిని అందించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

ప్రయాణం.. బహుదూరం!

● కోనాపూర్, మానాల గ్రామాల మధ్య లింకు రోడ్డు కరువు ● 8 కి.మీ. రోడ్డు లేక 28 కి.మీ. కాలినడక
● సమస్యను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామస్థుల వేడుకోలు

కమ్మర్‌పల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గ్రామం నూతనంగా ఏర్పడిన కొత్తచెరువు తండా గ్రామం కోనాపూర్, దానిపక్కనేగల రాజన్న సిరిసిల్లా జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామాలకు లింక్‌రోడ్డు లేక ఈ రెండు గ్రామాల మధ్య దూరభారం పెరిగి ప్రజలు, గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. ప్రతి గ్రామానికి లింక్ రోడ్డు అన్న పథకంలో అప్పటి ప్రభుత్వాలు కమ్మర్‌పల్లి మండలం లోని అన్ని గ్రామాలకు లింక్ రోడ్డు ఏర్పాటు చేసినప్పటికి కమ్మర్‌పల్లి మండలానికి 38 కిలో మీటర్ల దూరంలోగల మానాల, దానిపక్కనేగల కోనాపూర్ కొత్తచెరువుతండా గ్రామానికి మధ్య లింక్ రోడ్డు వేయడం మరిచారు. ఈ రెండు గ్రామాల మధ్య దూరం గుట్టలప్రాంతం నుంచి కేవలం 8 కిలోమీటర్లు మాత్రమే ఉంటుది. కాని ఈ లింక్‌రోడ్డు విషయం ఎవరు పట్టించుకోకపోవడంతో నిజామాబాద్, రాజన్న సిరిసిల్లా జిల్లాల సరిహద్దులో గల ఈ రెండు గ్రామాల ప్రజలు, గిరిజనులు అటు వైపువారు ఇటు, ఇటువైపువారు అటు ప్రయాణాలు సాగించాలంటే రాజన్న సిరిసిల్లా జిల్లా రుద్రంగి, జగిత్యాల జిల్లా కథలాపూర్, మండలాలు దాటి సుమారు 22 కిలోమీటర్లు ప్రయానించి వెల్లాల్సి వస్తుంది. మానాల గ్రామ సమీపంలోని గొర్రెగుండం మీదుగా అటవీ ప్రాంతం గుండా కోనాపూర్ కొత్తచెరువుతాండ గ్రామానికి కాలిబాటఉంది. ఈ బాటను సరిచేసి రెండు గ్రామాలకు లింక్ ఏర్పాటు చేయాలని రెండు గ్రామాల ప్రజలు గత కొంతకాలంగా వేడుకుంటున్న పట్టించుకునే నాథలు కరువయ్యారని ఆవేదన గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండుగ్రామాల పరిదిలో గిరిజనులు అధికంగా ఉన్నారు. రెండు గ్రామాలతో సత్సంబంధాలు, బంధుత్వాలు ఎక్కువగా ఉన్నాయి. కానీ తమవారిని కలుసుకోవాలంటే దూరభారం అధికమవుతోంది. మండలాలచుట్టూ తిరుగుతూ వెల్లాల్సి వస్తోందని, దీంతో దురభారం అధికమవుతోందని, అధికారులు ఇప్పటికైనా స్పందించాల్సి అవసరంఉందని వేడుకుంటున్నారు. మానాల గ్రామం నుండి రెండుకిలోమీటర్ల మెర గొర్రెగుండం వరకు మెటల్ రోడ్డు ఉంది, కోనాపూర్ కొత్తచెరువు తండా గ్రామం వరకు రహదారి మెటలింగ్ ఉంది. ఇటీవలే ఈతండా గ్రామానికి అప్పటి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి బీటీ రోడ్డు మంజూరు చేయించారు. ఈరెండు గ్రామాలను కలిపే రోడ్డు కేవలం మరో నాలుగైదు కిలోమీటర్లు అటవీప్రాంతంలో రోడ్డు నిర్మిస్తే ఈ రెండు గ్రామాలకు రాకపోకలు సుగమమవుతాయని, రెండు గ్రామాల మధ్య సంబంధాలు మరింత పేరిగే అవకాశం ఉందని, ఈ విషయంలో అప్పటి రాష్ట్ర రోడ్ల భవనాలు, రవాణా శాఖ, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్ అండ్ బీ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టిసారించాల ఇరుగ్రామాల ప్రజలు గిరిజనులు కోరినా కార్యరూపం దాల్చలేదు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున తమ దూర కష్టాలను కాంగ్రెస్ నాయకులు దూరం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. తమ గ్రామాలను కలిపే లింగ్ రోడ్డుకు కాంగ్రెస్ హయాంలో మోక్షం లభిస్తుందని మానాల, కోనాపూర్ కొత్తచెరువుతండా గ్రామస్థులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



కోనాపూర్ కొత్తచెరువు తండా గ్రామానికి వెళ్లే కాలిబాట దారి ఇదే..



మృతి చెందిన కోళ్లు

ఏర్గట్లలో నాటుకోళ్ల దొంగల కలకలం

● రోడ్లపై విషం కలిపిన ధాన్యం, మొక్కజొన్న విత్తనాలు
● 30 నాటుకోళ్ల మృతి.. మరికొన్నింటిని ఎత్తుకెళ్లిన వైనం

ఏర్గట్ల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : డిసెంబర్ 31న.. ఏర్గట్లలో మంగళవారం నాటు కోళ్ల దొంగలు కలకలం సృష్టించారు. మండల కేంద్రంలోని పలు ఇళ్లల్లో పెంచుకుంటున్న నాటు కోళ్లే లక్ష్యంగా దుండగులు రెచ్చిపోయారు. కోళ్ల కోసం విషపూరిత మందులు కలిపిన ధాన్యం, మొక్క జొన్న విత్తనాలను రోడ్లపై జల్లగా.. సుమారు 30నాటు కోళ్లు చనిపోగా, మరో 30కోళ్లను ఎత్తుకెళ్లారు. రాత్రి అయినప్పటికీ తమ కోళ్లు కనిపించకపోవడంతో పెంపకందారులు ఆందోళన వ్యక్తం చేశారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. విందును ఏర్పాటు చేసుకునేందుకే కొందరు దుండగులు ఇలాంటి పని చేశారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా.. గ్రామంలో ముగ్గురు దుండగులు ద్విచక్రవాహనంపై తిరగడాన్ని చూసిన పలువురు.. వారిని మందలించడంతో పరారైనట్లు స్థానికులు తెలిపారు. ఏదీ ఏమైనా ఏర్గట్లలో నాటు కోళ్ల దొంగతనం అందరినీ ఆశ్యర్యానికి గురి చేసింది. కాగా.. తమ కోళ్ల చోరీపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని వాటి యజమానులు తెలిపారు.



నాటుకోళ్ల కోసం రోడ్డుపై వేసిన ధాన్యం, మొక్కజొన్న విత్తనాలు



క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

టీఎస్‌జీహెచ్‌ఎంఏ క్యాలెండర్ ఆవిష్కరణ

కామారెడ్డి టౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు ఉత్తమ విద్యను అందించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నీల లింగం, కోశాధికారి రామస్వామి, అసోసియేట్ ప్రెసిడెంట్ సాయిరెడ్డి, రాజులు, రాష్ట్ర కౌన్సిలర్ రాజేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు.

మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఏర్పాటు

కామారెడ్డి టౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తు ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. చైర్‌పర్సన్‌గా ధర్మగోని లక్ష్మీ, వైస్ చైర్‌పర్సన్‌గా మినుకురి బ్రహ్మానందరెడ్డి, సభ్యులుగా అవుసుల బ్రహ్మం, లోకేటి సుదర్శన్‌రాం, కల్లూరి భూమయ్య, గోజు జ్యోతి, ఎర్రనారాగౌడ్, నాగరపు రాజలింగం, మహ్మద్ మక్బుల్, నూనవత్ గణేష్, కొత్త అరవింద్, భూపతి, లక్ష్మీరాజం, దోమకొండ శ్రీనివాస్‌లతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు ధర్మగోని లక్ష్మీ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతీ కార్యకర్తను గుర్తించుకుని వారికి అత్యున్నత పదవులను కట్టబెట్టడంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ముందుంటాడని తెలిపారు. తనకు అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.

ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి టౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): బాన్సువాడలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏఆర్‌టీ సెంటర్‌లో ఖాళీగా ఉన్న మెడికల్ ఆఫీసర్ అండ్ ఫార్మాసిస్ట్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెడికల్ ఆఫీసర్ పోస్టులు రెండు ఉన్నాయని తెలిపారు. ఈ పోస్టులకు ఎంబీబీఎస్ అయి ఉండాలని, కంప్యూటర్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ వినియోగం, ఎలక్ట్రానిక్ మెయిల్‌లో పనిచేసే పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. ఫార్మాసిస్ట్ తప్పనిసరిగా ఫార్మసీలో గ్రాడ్యుయేషన్ లేదా డిప్లొమాలో ఫార్మసీ పూర్తిచేసి ఉండాలని తెలిపారు. కంప్యూటర్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ వినియోగం, ఎలక్ట్రానిక్ మెయిల్‌లో పనిచేసే పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. పోస్టులు పూర్తిగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉంటాయని, బదిలీ చేయబడవని తెలిపారు. ఈనెల 2 నుంచి 8 వరకు స్వీకరించబడుతాయని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న లచ్చయ్య

ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

బాన్సువాడ టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర నాయకుడు డా. లచ్చయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం డీఏలు, డీఆర్‌లు సకాలంలో ప్రకటించకపోవడం, గత మార్చిలో పదవీవిరమణ పొందిన వారికి గ్రాట్యుటీ, కమ్యూటేషన్, జీపీఎఫ్ చెల్లించకపోవడం విచారకరమన్నారు. పెన్షనర్ల పట్ల విద్వేషాలను విడనాడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఖదీర్, కో కన్వీనర్‌గా దేవసుకుమార్, చంద్రప్ప, జిల్లా ప్రతినిధిగా సీమ గంగారాంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో హనుమంత్‌రెడ్డి, విజయరామరాజు, రవీందర్, ఆర్కే రెడ్డి, శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులున్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న మాల సంఘం నాయకులు

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును రద్దు చేయాలి

బాన్సువాడ టౌన్, డిసెంబరు 31 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆర్టికల్ 341 ప్రకారం రాజ్యాంగ వ్యతిరేకం కావున సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని మాల సంఘం బాన్సువాడ డివిజన్ నాయకులు మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వర్గీకరణతో మాలలకు తీరని అన్యాయం జరుగుతుందోన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ రంగాల్లో అమలు చేస్తున్న రిజర్వేషన్లు, ప్రైవేటు రంగాల్లో కూడా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల సంఘం వ్యవస్థాపకుడు అయ్యాల సంతోష్, బాన్సువాడ డివిజన్ నాయకులు ప్రశాంత్, బంగారు మైశయ్య, రవి, సంతోష్, ప్రశాంత్, దత్తు, అక్షయ్ తదితరులున్నారు.

అడవి పందిని ఢీకొని ఓ వ్యక్తి మృతి

● భార్య పరిస్థితి విషమం

ఎల్లారెడ్డి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : దంపతులు బైక్‌పై వెళుతుండగా.. అడవి పందులు అడ్డు వచ్చి బైక్‌కి తగలడంతో భర్త మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలైన ఘటన ఎల్లారెడ్డిలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఎల్లారెడ్డి మండలంలోని మత్తమాల గ్రామానికి చెందిన మైసగౌడ్ (55) కల్లు విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి అతని భార్య పద్మతో కలిసి మైసగౌడ్ ఎల్లారెడ్డిలోని బంధువుల ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో జంగమయ్యపల్లి శివారు సమీపంలో ఒక్కసారిగా అడవి పందులు అడ్డు వచ్చాయి. దీంతో అప్పటికే అతివేగంగా ఉన్న మైసగౌడ్.. ఓ పందిని బలంగా ఢీకొట్టడంతో భార్యాభర్తలిద్దరూ తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికులు వెంటనే వీరిద్దరిని హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో మైసగౌడ్ మృతి చెందాడు. మృతుడి భార్య పద్మ పరిస్థితి విషమంగా ఉంది. ప్రస్తుతం ఈమె హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

సామగ్రిని అమ్ముకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపాలిటీలో లక్షల విలువ చేసే సామగ్రిని అమ్ముకున్న వారిపై చర్యలు తీసుకోవాలని నిట్టు వేణుగోపాల్‌రావు అన్నారు. ఇప్పటికే ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేకపోవడంతో కమిషనర్‌ను మరోమారు కలిసి విన్నవించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కులమతాలకు అతీతంగా ఉండాలి

రాజంపేట, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని బస్వన్నపల్లి గ్రామంలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించినట్లు ఆర్‌ఐ లక్ష్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా గ్రామంలో అందరూ కలిసి ఉండాలని గ్రామస్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి సంధ్యారాణి, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈవో రాజు

కామారెడ్డి టౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): స్టేట్ టీచర్స్ యూనియన్ నూతన క్యాలెండర్‌ను మంగళవారం డీఈవో రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరం మరింత బాధ్యత యుతంగా, ఉత్సాహంగా ప్రతీ ఉపాధ్యాయుడు పని చేస్తు వచ్చే మూడు నెలల్లో వచ్చే పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత పెంచినప్పుడే ఉపాధ్యాయుల పనితీరుపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుంట రాములు, అసోసియేట్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ఫైనాన్షియల్ సెక్రటరీ ఖలిమొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

రాజంపేట: రాజంపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పీఆర్‌టీయూ నూతన క్యాలెండర్‌ను ఎంపీడీవో రఘురాం, ఎంఈవో పూర్ణచందర్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సంతోష్‌కుమార్ మాట్లాడుతూ పీఆర్‌టీయూ నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన అధికారులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా బాధ్యులు దుర్గయ్య, రాష్ట్రబాధ్యులు సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో, ఎంఈవో నాయకులు

కబ్జా స్థలంలో కంచె వేసిన అధికారులు

● స్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో



లింగంపేటలో కబ్జా స్థలంలో కంచె వేసిన అధికారులు

లింగంపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 1074లో గల 600 గజాల ప్రభుత్వ స్థలానికి మంగళవారం అధికారులు కంచె వేశారు. లేఅవుట్‌కు అనుమతి ఇచ్చినందుకు పంచాయతీకి 1989లో ఇచ్చిన నాలుగు ప్లాట్ల స్థలం 600 గజాలను కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని గ్రామస్థులకు సమాచారం రావడంతో గ్రామస్థులు అన్ని కుల సంఘాల నాయకులు వ్యాపార, వాణిజ్య సంస్థలను బంద్ చేసి రాస్తారోకో చేయడంతో అధికారులు స్పందించారు. మంగళవారం ఆర్డీవో ప్రభాకర్ స్థలాన్ని పరిశీలించి ఎవరు కబ్జా చేయకుండా కంచె వేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు స్థలం చుట్టు కంచె వేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, పంచాయితీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్‌లు ఉన్నారు.

దోమకొండ ఎస్సై భిక్కనూర్‌కు బదిలీ

దోమకొండ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): దోమకొండ ఎస్సై డి. ఆంజనేయులు భిక్కనూర్‌కు బదిలీ అయ్యారు. ఆయన గత నాలుగు నెలల క్రితం కోనరావుపేట నుంచి దోమకొండకు సాధారణ బదిలీపై వచ్చారు. దోమకొండలో ఆయన 4 నెలల పాటు విధులు నిర్వహించి బదిలీపై భిక్కనూర్ పోలీసు స్టేషన్ వెళ్లనున్నారు. ఆయన భిక్కనూర్‌లో బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. కాగా అధికారులు దోమకొండ పోలీసు స్టేషన్‌కు ఇప్పటి వరకు ఎవరినీ నియమించలేరు.

దోమకొండలో 238 కేసుల నమోదు

దోమకొండ పోలీసు స్టేషన్ పరిధిలో 2024 సంవత్సరంలో మొత్తం 238 కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం దోమకొండ పీఎస్ పరిధిలో 147 కేసులు అయినట్లు తెలిపారు. గతంలో కంటే ఈ యేడు 91 కేసులు ఎక్కువగా నమోదైనట్లు వివరించారు.

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎవరైన ఇష్టానుసారంగా బైక్‌లను నడిపినా.. అనుమతి లేని ప్రదేశాల్లో మద్యం తాగినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు. కొత్త సంవత్సరం రోజున పోలీసులు అన్ని చోట్ల ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, పోలీసుల నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



మాట్లాడుతున్న భారతీయ విద్యార్థి మోర్చ రాష్ట్ర కార్యదర్శి విఠల్

కామారెడ్డి టౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షా ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని భారతీయ విద్యార్థి మోర్చ రాష్ట్ర కార్యదర్శి జీవీయం విఠల్ అన్నారు. మంగళవారం సమగ్రశిక్షా ఉద్యోగులు గత కొద్దిరోజులుగా చేస్తున్న నిరసనకు ఆయన మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు గత కొన్నిరోజులుగా వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేస్తున్నారు. వీరి వల్ల విద్యావ్యవస్థ పూర్తిగా స్తంభించిందని అన్నారు. గత ప్రభుత్వం కూడా వారి సమస్యలు పరిష్కరించకుండా వారిని మభ్యపెడుతూ వచ్చారని అన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడితే ప్రస్తుత ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రావణ్, అజయ్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

హుషారుగా నూతన సంవత్సర స్వాగత వేడుకలు

లింగంపేట, డిసెంబరు 31: నూతన సంవత్సర అరంభం బాగుంటే ఏడాదంతా సంతోషంగా గడిచిపోతుందని భావిస్తారు చాలా మంది అందుకే 2025 నూతన సంవంత్సరానికి స్వాగతం చెప్పే సమయాన్ని చాలా ఘనంగా, సంతోషంగా ఏర్పాటు చేసుకున్నారు. లింగంపేట మండల కేంద్రంలో నూతన సంవత్సరం పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం సందడి వాతావరణం నెలకొన్నది. మిఠాయి దుకాణాలు, హోటళ్లు, బిర్యానీ సెంటర్లు, చికెట్ సెంటర్లు, బేకరీలతో పాటు మద్యం దుకాణాలు జనాలతో కిక్కిరిసిపోయాయి. ముగుసిపోతున్న 2024కు వీడ్కోలు పలుకుతూ 2025 కొత్త సంవత్సరానికి స్వాగతం చెప్పేందుకు యువత, ప్రజలు తమ బంధుమిత్రులతో విందు ఏర్పాట్లు చేసుకున్నారు. మంగళవారం నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని బేకరీ యజమానులు ఆఫర్‌లను కూడా ప్రకటించి కేకులను తక్కువ ధరకే విక్రయించారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని మహిళలు ముగ్గులు వేసుకోవడానికి రంగు రంగుల కలర్లు విక్రయానికి ఉంచారు. నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని పోలీసులు సూచించారు.



బేకరీలో కేకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

నూతన సంవత్సరానికి స్వాగతం పలికిన యువకులు

మద్నూర్: ఒకప్పుడు పట్టణాల్లో నిర్వహించే నూతన సంవత్సరం వేడుకలు ప్రస్తుతం గ్రామాలకు పాత సంవత్సరానికి ముగింపు పలికి 2025 నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మంగళవారం తెల్లవారు జాము వరకు నూతన ఉత్సవంతో యువకులు స్వాగతం పలికారు. మద్యం దుకాణాలు అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచడంతో మద్యం తాగి జల్సాలు చేశారు. గ్రామీణ ప్రాంతాలలో నూతన సంవత్సరం పురస్కరించుకుని కేక్‌లు కట్ చేసి, రాత్రికి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు ఏర్పాట్లు చేశారు. పోలీసులు ఆయా గ్రామాల్లో రాత్రివేళ గస్తీలు తిరుగుతూ అప్రమత్తంగా ఉండి అల్లర్లు జరుగకుండా చర్యలు తీసుకున్నారు.

తిరుపతి నృత్యోత్సవంలో విద్యార్థుల ప్రతిభ

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ నటరాజాలయం కల్చరల్ డెవలప్‌మెంట్ అకాడమి, కూచిపూడి కళాక్షేత్రం ఆధ్వర్యంలో రెండవ భారత్ కల్చరల్ డ్యాన్స్ ఫెస్టివల్ రెండు రోజుల పాటు తిరుపతిలోని మహతీ ఆడిటోరియంలో జరిగింది. రెండు రాష్ట్రాలకు చెందిన పాఠశాల విద్యార్థులు పాల్గొన్న ఈ నృత్యోత్సవంలో నగరానికి చెందిన విజయ్ హైస్కూల్ విద్యార్థులు తన్వి, స్నిగ్ధలు పాల్గొని శ్రీకృష్ణ నాట్య మణిబాల పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిలను పాఠశాల వ్యవస్థాపకురాలు అమృతలత, కరస్పాండెంట్ విప్రభాదేవి, ప్రిన్సిపల్ విజేతలు మంగళవారం అభినందించారు.

అమరవీరుల స్థూపం వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగుల నివాళ్లు

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు మంగళ వారం జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లోగల తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. 24వ రోజు నిరసనలో భాగంగా వినాయక్‌నగర్ అమరవీరుల స్థూపం నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, భూపేందర్‌లు మాట్లాడుతూ.. తెలంగాణ అమరవీరుల త్యాగాలపై ఏర్పడ్డ రాష్ట్రంలో సమగ్ర శిక్షా ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు.

భవనంపై నుంచి పడి యువతి మృతి

ఖిల్లా: ప్రమాదవశాత్తుభవనంపై (దాబపై)నుంచి పడి మహిళ మృతి చెందిన ఘటన నగరంలోని నాల్గొ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. నాల్గొటౌన్ రెండవ ఎస్ఐ ఉదయ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. బోర్గాం(పి)గ్రామానికి చెందిన కాలూరి నిహారిక(32)భవనంపైన బట్టలు ఆరబెట్టడానికి వెళ్లింది. భవనంకు పైన ప్రహరీగోడ లేకపోవడంతో ప్రమాదవశాత్తు కిందపడింది. ఈ ఘటనలో ఆమెకు బలమైన గాయాలు కాగ గమనించిన కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.



పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొన్న అధికారులు, ప్రజలు

సుల్తాన్‌నగర్‌లో పౌర హక్కుల దినోత్సవం

నిజాంసాగర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సుల్తాన్‌నగర్ గ్రామంలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ భిక్షపతి అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఆలయాల ప్రవేశం ఉందా లేదని అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ ఎస్టీలకు అవగాహన కల్పించారు. రెండు గ్లాసుల పద్ధతి ఉన్నట్లయితే సమాచారం అందిస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్, గ్రామ ప్రముఖులు తదితరులు ఉన్నారు.



బోరు మోటారును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్

6వ వార్డులో బోరు మోటారు ప్రారంభం

ఎల్లారెడ్డి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మున్సిపాలిటీ 6వ వార్డులో నీటి ఎద్దడి ఉందని వార్డు ప్రజలు మున్సిపల్ చైర్మన పద్మ శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన బోర్‌లో మోటార్ పరిశీలించి, నీరు ఉండటం గమనించి మంగళవారం సింగిల్ ఫేస్ మోటార్ ఏర్పాటు చేయించారు. దీంతో పుష్కలంగా నీరు రావడంతో నీటి ఎద్దడి తీరింది. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సంఘని బాలమణి, పోచయ్య, 12వ వార్డు కౌన్సిలర్ జంగం నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.



మద్నూర్ నుంచి శబరిమలైకి బియ్యాన్ని తరలిస్తున్న దృశ్యం

అయ్యప్ప సేవా సమితికి బియ్యం పంపిణీ

మద్నూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మద్నూర్ మండల అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి వారికి 34 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేయడం జరిగిందని గురుస్వామి రాజు తెలిపారు. ప్రతీ ఏడాది శబరిమలైలో భాగ్యనగరం అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో జరిగే అన్నదానం కోసం బియ్యం మద్నూర్ మండల కేంద్రం నుంచి పంపించడం జరిగిందని పేర్కొన్నారు.



పుస్తకాలు,పర్నిచర్ అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

గ్రంథాలయానికి పుస్తకాలు, ఫర్నిచర్ అందజేత

బిచ్కుంద, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రంథాలయానికి పుస్తకాలు, ఫర్నిచర్‌ను మంగళవారం జేడీ లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఇన్‌చార్జ్ కవితారెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవసరం ఉన్నవారికి సహాయపడడం వల్ల అది చూసిన మరో నలుగురికి సమాయపడాలనే ఆలోచన వస్తుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, ఫౌండేషన్ సభ్యులు సాయిమోహన్ తదితరులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నాసాగర్‌లో పలువురు కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబ సభ్యులను మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యం పరామర్శించారు. అంకాశేశ్వరరెడ్డి, మోహన్‌గౌడ్‌ల కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామ్‌రెడ్డిని కలిసి మెరుగైన వైద్య చికిత్సం అందేలా చూడాలని వైద్యులకు సూచించారు. ఎల్లారెడ్డి యూత్ వైస్ ప్రెసిడెంట్ కిరణ్ తేజ, అన్నాసాగర్ యూత్ అధ్యక్షుడు నసీర్, మాజీ ఎంపీటీసీ గురుప్రతాప్, రామాగౌడ్, సాయాగౌడ, మొగులగౌడ్, ప్రమోద్‌గౌడ్, హైమద్ పాషా, అశోక్‌రెడ్డి, కాశీరాం, బాలయ్య తదితరులు ఉన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- రోటి కప్‌డా రోమాన్స్
దర్శన్	- యూఐ
ప్రియా 70	- పుష్ప-2
ప్రియా 35	- మ్యాక్స్

బాన్సువాడ

మహేశ్వరి	- పుష్ప-2
వెంకటేశ్వర	- మ్యాక్స్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	160
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

